

అలరించిన రంగవల్లులు 2



రోడ్డు భద్రత నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలి.. 2



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు

**అక్షరటుడే, బాల్కొండ:** ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీపై ఉద్యానశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాలు అందించనున్నట్లు ఆ శాఖ డివిజనల్ ఉద్యాన అధికారి రుద్ర వినాయక్ పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. బాల్కొండ, ముప్కల్, మెండోరా, ఎర్గట్ల మండల ఎస్సీ, ఎస్టీ రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. ఉద్యాన శాఖ నుంచి 50శాతం సబ్సిడీలో పెట్రోల్ పంపులు, బ్రష్ కట్టర్లు అందిస్తామన్నారు. దీనికి గాను రైతు ముందుగా పనిముట్లను కొనుగోలు చేయాలన్నారు. అనంతరం జీఎస్టీ బిల్లుతో పాటు దరఖాస్తును ఉద్యాన అధికారికి అందిస్తే, 50శాతం సబ్సిడీ నేరుగా వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని తెలిపారు.






## రేపు మున్సిపల్ వార్డుల్లో మహిళా రిజర్వేషన్ల ఖరారు

**అక్షరటుడే, ఇందూరు:** మున్సిపల్ ఎన్నికల నిర్వహణ ప్రక్రియ వేగం పుంజుకుంది. ఈ సందర్భంగా జిల్లాలోని నిజామాబాద్ నగర పాలక సంస్థతో పాటు భీమ్‌గల్, ఆర్మూర్, బోధన్ మున్సిపాలిటీ వార్డులకు మహిళా రిజర్వేషన్లను నిర్ణయించనున్నారు. ఈ మేరకు ఈనెల 17న కలెక్టర్ కార్యాలయంలో డ్రా తీయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. భీమ్‌గల్ మున్సిపాలిటీకి సంబంధించి ఉదయం 10 గంటలకు, ఆర్మూర్ మున్సిపాలిటీకి సంబంధించి 10.15 గంటలకు, బోధన్ మున్సిపాలిటీలకు సంబంధించి 10:30 గంటలకు డ్రా ఉంటుందన్నారు. అలాగే నగరపాలక సంస్థ డివిజన్‌లో మహిళా రిజర్వేషన్ల డ్రా ప్రక్రియ 11 గంటలకు ఉంటుందని పేర్కొన్నారు.

## భీమ్‌గల్ మున్సిపల్ ఓటరు జాబితా విడుదల

**అక్షరటుడే, భీమ్‌గల్ :** భీమ్‌గల్ పురపాలక సంఘం పరిధిలోని 1 నుంచి 12 వార్డులకు సంబంధించిన తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2026 సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఈ జాబితాను సిద్ధం చేసినట్లు వివరించారు. మున్సిపాలిటీలో మొత్తం 24 తుది పోలింగ్ కేంద్రాల జాబితాతో పాటు, పోలింగ్ కేంద్రాల వారీగా ఫొటోలతో కూడిన ఓటరు జాబితాను కూడా అందుబాటులో ఉంచారు. ప్రజల పరిశీలన కోసం ఈ జాబితాలను స్థానిక మున్సిపల్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. రాబోయే ఎన్నికల దృష్ట్యా ఓటర్లు తమ పేర్లను, పోలింగ్ కేంద్రాల వివరాలను సరిచూసుకోవాలని అధికారులు సూచించారు.

**రాష్ట్రంలో త్వరలో మున్సిపల్ ఎన్నికల నగరా మోగనుంది. ఉమ్మడి జిల్లాలో మున్సిపల్ పీఠాలను కైవసం చేసుకోవాలని అన్ని పార్టీలు ప్రయత్నం చేస్తున్నాయి. అయితే రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల కోసం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఓటరు జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాలను ఎన్నికల సంఘం విడుదల చేసింది. మిగిలింది రిజర్వేషన్ల పై స్పష్టత రావడమే. రెండు మూడు రోజుల్లో ఛైర్‌పర్సన్, మేయర్ల రిజర్వేషన్‌తో పాటు వార్డుల వారీగా రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.** - అక్షరటుడే, ఇందూరు



# ఈ సారి పీఠం ఎవరిదో?

■ మున్సిపల్ ఛైర్‌పర్సన్ రిజర్వేషన్లపై ఉత్కంఠ ■ తారుమారు అవుతాయంటూ ప్రచారం ■ ఆశావహుల ప్రయత్నాలు

నిజామాబాద్ జిల్లాలో ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్ మున్సిపాలిటీలతో పాటు నిజామాబాద్ నగరపాలక సంస్థకు ఎన్నికలు జరగనున్నాయి. రెండు రోజుల క్రితం మున్సిపాలిటీల వారిగా ఏ సామాజిక వర్గానికి ఎన్ని వార్డులు కేటాయించారో ఎన్నికల సంఘం ప్రకటించింది. మిగిలింది వార్డుల వారీగా రిజర్వేషన్లు, అలాగే మున్సిపల్ ఛైర్మన్లు మేయర్ల రిజర్వేషన్లను ప్రకటించడమే. దీంతో ప్రధాన పార్టీల నేతలతో పాటు ఆశావాహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. కౌన్సిలర్‌గా గెలవడంతోపాటు మున్సిపల్ ఛైర్మన్‌గా ఎన్నిక కావడానికి ప్రధాన పార్టీల నేతలు ఇప్పటి నుంచే ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.

### గతంలో ఇలా..

మున్సిపల్ ఎన్నికలు 2020లో జరిగాయి. బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్ పదవులు ఆ సమయంలో బీసీ మహిళకు కేటాయించారు. నిజామాబాద్ మేయర్ బీసీ జనరల్‌కు దక్కింది. అయితే ఈసారి మార్పులు జరుగుతాయి అంటూ పుకార్లు షికారు చేస్తున్నాయి. గతంలో మహిళా రిజర్వేషన్ వచ్చిన చోటా.. ఈ సారి జనరల్ వచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే గతంలో అన్ని పీఠాలు బీసీలకు కేటాయించగా.. ఈ సారి ఇతర కులాలకు వెళ్లే అవకాశం ఉంది.

### ప్రధాన పార్టీల దృష్టి

నిజామాబాద్ మేయర్‌తో పాటు ఆయా మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్ పీఠంపై ప్రధాన పార్టీలు దృష్టి సారించాయి. నగరపాలక సంస్థలో 60 డివిజన్లు ఉండగా...గతంలో బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నాయి. గతంలో 28 స్థానాల్లో గెలిచిన బీజేపీ కొద్దిలో మేయర్ పదవిని కోల్పోయింది. ఈసారి బలమైన అభ్యర్థులను బరిలో నిలిపేందుకు కసరత్తు చేస్తోంది. మరోవైపు అధికార కాంగ్రెస్ పార్టీ సైతం మేయర్ పీఠాన్ని కైవసం చేసుకునేందుకు కృషి చేస్తుంది. ఇప్పటికే ఆశావాహుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుంది. అలాగే ఆర్మూర్, బోధన్, భీమ్‌గల్లోనూ గతంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు గెలుపొందగా.. ఈ సారి సత్తా చాటేందుకు కాంగ్రెస్, బీజేపీ యత్నిస్తున్నాయి.

### కామారెడ్డి జిల్లాలో..

కామారెడ్డి జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద మున్సిపాలిటీలు ఉన్నాయి. బిచ్కుంద కొత్తగా బల్దియాగా మారింది. మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లు తారుమారు అవుతాయని సమాచారం. కామారెడ్డిలో గత పదేళ్లుగా జనరల్ మహిళా రిజర్వేషన్ కొనసాగింది. ఎల్లారెడ్డి, బాన్సువాడ మున్సిపాలిటీల్లో గత ఎన్నికల్లో ఛైర్‌పర్సన్ పదవిని బీసీ జనరల్ కేటాయించారు. ఈ సారి మూడు చోట్ల రిజర్వేషన్ మారనున్నట్లు తెలుస్తోంది. కొత్తగా ఏర్పడిన బిచ్కుందలో సైతం ఏ రిజర్వేషన్ అనేది తెలియాల్సి ఉంది.

### గతంలో బీఆర్ఎస్ హవా

గత ఎన్నికల్లో అప్పటి అధికార పార్టీ బీఆర్ఎస్ హవా కొనసాగింది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ పార్టీ జెండా ఎగురవేసింది. కామారెడ్డిలో 49 వార్డులలో బీఆర్ఎస్ 23, కాంగ్రెస్ 13, బీజేపీ 8, స్వతంత్ర అభ్యర్థులు ఐదుగురు గెలుపొందారు. బాన్సువాడలో 19 వార్డుల్లో 17 బీఆర్ఎస్ గెలుచుకోగా 2 వార్డుల్లో కాంగ్రెస్ గెలుపొందింది. ఎల్లారెడ్డిలో 12 వార్డులలో 9 వార్డులు బీఆర్ఎస్, మూడు వార్డులు కాంగ్రెస్ గెలిచాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ మెజారిటీ సీట్లు సాధించాలని ప్రణాళికలు రచిస్తోంది. బీఆర్ఎస్, బీజేపీ సైతం మున్సిపల్ పీఠాలను గెలుచుకోవడానికి శ్రమిస్తున్నాయి.



## జర్నలిస్టుల అరెస్ట్‌ను నిరసిస్తూ కామారెడ్డి కలెక్టరేట్ వద్ద నిరసన

**అక్షరటుడే, కామారెడ్డి:** జర్నలిస్టుల అరెస్ట్ హేయమైన చర్య అని కామారెడ్డి జర్నలిస్టులు అన్నారు. కలెక్టరేట్ వద్ద వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ఉన్న ఎన్టీవీ జర్నలిస్టులపై భౌతిక దాడులకు దిగడం, వారిని అరెస్టు చేయడం సరికాదన్నారు. సమాజంలో నాల్గో స్తంభంగా కొనసాగుతున్న మీడియాపై దాడి తగదని జర్నలిస్టులు పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధులుగా ఉన్న జర్నలిస్టులపై దాడులు చేయడం వారి మనోధైర్యాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అర్ధరాత్రి పోలీసులు కార్యాలయంలోకి వెళ్లి అరెస్టు చేయడం సరికాదన్నారు. చట్టపరంగా ముందుకు వెళ్లాలి తప్ప ఇలాంటి అణిచివేతను జర్నలిస్టు సంఘాలు ఖండిస్తున్నాయని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా జర్నలిస్టులకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. అనంతరం జిల్లా అడిషనల్ కలెక్టర్ మధు మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ), టీడబ్ల్యూజేఎఫ్, టీఎస్యూజే జర్నలిస్టులు, వివిధ జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రామన్నపేటలో రాజరాజేశ్వర స్వామి జాతర



**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ మండలంలోని రామన్నపేట అయ్యలగుట్టపై రాజరాజేశ్వర స్వామి జాతరను ఈనెల 18న (ఆదివారం) నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. మాఘ అమావాస్యను పురస్కరించుకుని నిర్వహించే ఈ వేడుకల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతర సందర్భంగా ఆదివారం ఉదయం 9:30గంటలకు శివాలయం నుండి అయ్యలగుట్ట వరకు చిన్న పల్లకీ సేవ, స్వామివారికి అభిషేకం ఉంటుంది. సాయంత్రం ఎడ్లబండ్లతో అయ్యలగుట్ట చుట్టూ చిన్న శావ (సేవ) ప్రదక్షిణలు ఉంటాయి. రాత్రి 7:30గంటలకు మధ్య పెద్దశావ (సేవ) ఊరేగింపు నిర్వహించనున్నారు.



## దర్జాగా రోడ్లపై కేజ్‌వీల్స్..

**కేజ్‌వీల్స్ రోడ్లపై తిప్పితే వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని పోలీస్ అధికారులు గతంలో అనేకమార్లు హెచ్చరించారు.. అయినప్పటికీ గ్రామాల్లో కొందరు వ్యక్తులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రూ. లక్షలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన బీటీ రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లతో తిప్పుతూ నాశనం చేస్తున్నారు. వేల్పూరు మండలం జాన్కంపేట్, పచ్చల నడ్కుడ గ్రామాల ప్రధాన రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లతో తిరుగుతున్న దృశ్యమిది.** – అక్షరటుడే, ఆర్మూర్

## ఒకే భవనంలో రెండు కార్యాలయాలు..

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని పోచారం తండాలో ఒకే భవనంలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం అద్దె భవనంలో నిర్వహిస్తుండడంతో గత ప్రభుత్వ కాలంలో భవన నిర్మాణం చేపట్టారు. దీంతో అద్దె భవనం నుంచి ప్రభుత్వ భవనంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని మార్చారు. కానీ ఇదే భవనంలో గ్రామ పంచాయతీ కార్యాలయం కూడా కొనసాగిస్తున్నారు. దీంతో అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే విద్యార్థులు వరండాలో కూర్చోవాల్సిన పరిస్థితి నెలకొంది. భవనంలోని ఒక గదిలో గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. మిగిలిన రెండు చిన్నగదుల్లో ఒకటి స్టోరేజ్ కోసం, మరొక గదిని వంటకోసం అంగన్‌వాడీ నిర్వాహకులు వాడుకుంటున్నారు. దీంతో అంగన్‌వాడీకి వచ్చే విద్యార్థులు.. బాలింతలు, గర్భిణులు ఆవరణలోనే కూర్చోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.






## సంక్రాంతి స్పెషల్.. కొత్త అల్లుడికి 150 వంటకాలతో విందు

**సంక్రాంతి సందర్భంగా కొత్త అల్లుడికి అత్తామామలు గుర్తుండిపోయే విందు ఇచ్చారు. 150 రకాల వంటకాలతో విందు ఏర్పాటు చేసి ప్రత్యేకంగా నిలిచారు. వర్ని మండల కేంద్రంలోని సత్యనారాయణపురంలో లక్ష్మీరాంబాబు దంపతులు తమ కుమార్తెకు రెండు నెలల క్రితం వివాహం జరిపించారు. సంక్రాంతికి కొత్త అల్లుడిని భోజనానికి ఇంటికి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏకంగా 150 రకాల తీపి, పిండి వంటలను సిద్ధం చేశారు. పెద్ద అరటి ఆకులో అన్ని వంటకాలను వడ్డించి, కుటుంబ సభ్యులతో కలిసి అల్లుడికి ప్రత్యేక విందు ఇచ్చారు. ఈ వినూత్న విందు స్థానికంగా అందరిని ఆకట్టుకుంది.** - అక్షరటుడే, బాన్సువాడ

## ముంబయి కార్పొరేషన్ మాదిరిగానే ఇందూరులోనూ గెలుస్తాం

**అక్షరటుడే, ఇందూరు:** ముంబయి కార్పొరేషన్ ఎన్నికల్లో బీజేపీ మహాయుతి కూటమి ఘనవిజయం సాధించిందని.. అదే స్ఫూర్తితో ఇందూరులోనూ విజయ సాధిస్తామని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ చౌక్‌లో శుక్రవారం ముంబయి కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో పటాకులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహారాష్ట్రలో మొత్తం 29 కార్పొరేషన్లకు గాను 26 బీజేపీ మహాయుతి కూటమి గెలుపొందిందన్నారు. హిందువులంతా ఏకమై ఘన విజయాన్ని అందించారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలోనూ బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అంటే మైనారిటీ అని.. మైనారిటీలు అంటే కాంగ్రెస్ అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పడం ప్రజలు గ్రహించారన్నారు. అప్పటినుంచి హిందూ ఆలయాలపై దాడులు పెరిగాయన్నారు.



నిజామాబాద్‌లో బీజేపీ గెలుపు ఖాయమని, ఇందూరుగా పేరు మార్చడం కూడా ఖాయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నాగోళ్ల లక్ష్మీనారాయణ, కార్యదర్శి జ్యోతి, ఆయా మండలాల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నీ విజేత పెర్కిట్ జట్టు




**అక్షరటుడే ముప్కాల్:** మండల కేంద్రంలో నాలుగు రోజులుగా కొనసాగిన పన్నీరు వెంకటేష్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ముగింపు కార్యక్రమానికి తెలంగాణ కబడ్డీ సంఘం జిల్లా అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. మొత్తం 20 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో పెర్కిట్ జట్టు విజేతగా నిలిచింది. విజేత జట్టుకు రూ.10,000 నగదు షీల్డ్, రన్నర్‌గా నిలిచిన ముప్కాల్ జట్టుకు రూ.5,000 నగదు బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ముస్కు భూమేశ్వర్, అధ్యక్షుడు శ్రీధర్, శ్రీనివాస్, షబీర్, నవీన్, ముజ్జు తదితరులు పాల్గొన్నారు.

## హిందువులు తమ మూలాలను మర్చిపోవద్దు




**అక్షరటుడే, ఇందూరు:** భారతదేశంలో పుట్టిన వారందరూ హిందువులేనని ఎన్నటికీ తమ మూలాలను మర్చిపోవద్దని ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగం ప్రచార ప్రముఖ డాక్టర్ వారే దస్తగిరి అన్నారు. ఆర్ఎస్ఎస్ కంఠేశ్వర్ ఉపనగర ఆధ్వర్యంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించారు. హిందూ ధర్మంలో అసమానతలు లేవని సమస్త ప్రాణకోటిని భగవంతుడు తన పిల్లలుగా భావిస్తాడన్నారు. ప్రతి హిందువును స్వయంసేవక్‌గా మల్చడానికి అందరూ కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. విశ్రాంతర ప్రధానోపాధ్యాయుడు లింబాద్రి, ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘచాలకు డాక్టర్ కాపర్తి గురు చరణం, ఉపనగర కార్యవాహ ప్రవీణ్, రామ్ లక్ష్మణ్, శ్రావణ్, సత్యనారాయణ పాల్గొన్నారు.







# అలరించిన రంగవల్లులు



సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్ల ముంగిట వేసే రంగురంగుల ముగ్గులు సంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తాయి. ఈ సందర్భంగా ఉమ్మడిజిల్లాలో మహిళలు తమ ఇళ్ల ముందు అందంగా ముగ్గులు వేశారు. కొన్ని ప్రాంతాల్లో ముగ్గుల పోటీలు సైతం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.
– అక్షరటుడే, నెట్‌వర్క్




## లింగంపేటలో 'అలైవ్ అరైవ్' కార్యక్రమం

**అక్షరటుడే, లింగంపేట:** మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం 'అలైవ్ అరైవ్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై దీపక్ కుమార్ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలను పాటించాలని, రోడ్డు ప్రమాదంతో ఎన్నో కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయని అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలు భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సురేష్, ఎంపీడీవో నరేష్, ఎంపీవో మళహరి, సిబ్బంది పాల్గొన్నారు.




## గృహజ్యోతి పథకం పత్రాల పంపిణీ



**అక్షరటుడే, మప్కాల్:** మండలంలోని వేంపల్లిలో విద్యుత్ శాఖ అధికారులు గృహజ్యోతి పథకానికి సంబంధించి లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం పేదప్రజలకు 200 యూనిట్ల ఉచిత కరెంట్ అందిస్తోందన్నారు. దీనికి సంబంధించి లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మహేష్ యాదవ్, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాయావతి బర్త్‌డే సందర్భంగా పండ్లు పంపిణీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** బహుజన్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి జన్మదినాన్ని ఎల్లారెడ్డి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు ఆ పార్టీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. మర్లు సాయిబాబు,కుసుల కంటి సాయిలు, పద్మారావు పాల్గొన్నారు.





## ముప్కాల్ కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

**అక్షరటుడే, ముప్కాల్:** ముప్కాల్ మండల కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తెలంగాణ కబడ్డీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబడ్డీ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో జీఎన్ఆర్ గార్డెన్స్‌లో ముప్కాల్ కబడ్డీ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముప్కాల్ కబడ్డీ అసోసియేషన్ ఛైర్మన్‌గా మోతే గంగారెడ్డి, అధ్యక్షుడిగా ఏలేటి గంగాధర్ (విజయ్), ప్రధాన కార్యదర్శిగా ముస్కు శ్రీనివాస్, కోశాధికారి గాండ్ల చిన్న బాలరాజ్, ఉపాధ్యక్షులుగా గద్దల గంగారాం, ఏలేటి రాములు, సహ కార్యదర్శులుగా గొర్రె మోహన్, లోక సుభాష్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా బద్దం హన్మాండ్లు, బుర్కల సాయిలు, కార్యవర్గ సభ్యులుగా ఏలేటి మల్లారెడ్డి, ఇలియాస్, బద్దం అశోక్ రెడ్డి, ముస్కు చిన్న నర్సయ్య, కంచు నరేష్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ముస్కు మోహన్, దేవరాజు, సుంకరి ప్రదీప్, గంగారాజు, వై.గంగాధర్, హరీష్, మహేష్, చారి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## భీమ్‌గల్ పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**అక్షరటుడే, భీమ్‌గల్ :** మండల కేంద్రంలో పాస్టర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి హాజరైన పాస్టర్లు ఎన్నిక ప్రక్రియను పూర్తి చేశారు. గౌరవ అధ్యక్షుడిగా డి. శామ్యూల్, అధ్యక్షుడిగా బోయిడి సుధాకర్, ఉపాధ్యక్షుడిగా మోహన్ పాల్, ప్రధాన కార్యదర్శిగా ఫిలోమోన్, సహాయ కార్యదర్శిగా టైటాస్, కోశాధికారిగా నెల్సన్, గౌరవ సలహాదారులుగా డేవిడ్, జీవరత్నం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. పాస్టర్ల సంక్షేమానికి, ఐక్యతకు పెద్దపీట వేస్తామని తెలిపారు. ఆధ్యాత్మిక విలువలను కాపాడుతూ, సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సీనియర్ పాస్టర్లు, సభ్యులు ఘనంగా సన్మానించారు.

## డిజిటల్ మీడియా రంగంలో 'అక్షరటుడే'కు ప్రత్యేకస్థానం



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి :** డిజిటల్ మీడియా రంగంలో 'అక్షరటుడే' ప్రత్యేకస్థానం సాధించిందని తహశీల్దార్ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం ఎంపీడీవో రాజ శ్రీనివాస్, ఎస్సై జి.అనిల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, తపస్ ఉపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు సల్లూరి కిషన్ గౌడ్ ఆధ్వర్యంలో 'అక్షరటుడే' క్యాలెండర్లను ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ.. నేటి డిజిటల్ మీడియాలో 'అక్షరటుడే' తనకంటూ లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని సాధించిందన్నారు. 'అక్షరటుడే' మండల ప్రతినిధి వెంకటేష్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ నాగభూషణం, మండల సాఫ్ట్‌బాల్ కోచ్ రాహుల్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రికెట్ పోటీల్లో విజేతలకు బహుమతులు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎల్లారెడి మున్సిపాలిటీ పరిధిలోని గండి మాసాని పేటలో క్రికెట్ పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. రెండు రోజులపాటు జరిగిన క్రీడల్లో జట్లు పోటాపోటీగా తలపడ్డాయి. అందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాల్లో నిలిచిన జట్లకు గ్రామ యువకులు నగదు బహుమతిని అందజేశారు. యువకులు, విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు క్రికెట్ పోటీలను నిర్వహించినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. యువత క్రీడాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని వారన్నారు.







ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ శ్రావణి ఆధ్వర్యంలో..

# వేగంగా వార్తలు అందించడంలో 'అక్షరటుడే'కు ప్రత్యేకస్థానం

**అక్షరటుడే, ఆర్మూర్ :** వేగంగా వార్తలు అందించడంలో 'అక్షరటుడే' ప్రత్యేకస్థానం సాధించిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం 'అక్షరటుడే' క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిక్కచ్చిగా వార్తలు అందిస్తూ.. డిజిటల్ మీడియా రంగంలో 'అక్షరటుడే' ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు. ఆర్మూర్ ఏఎంసీ ఛైర్మన్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ శ్రావణి, ఎంవీఐ రాహుల్ కుమార్, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్, సీనియర్ న్యాయవాదులు కృష్ణ పండిత్, వెంకటేశ్వర్లు 'అక్షరటుడే' క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సీనియర్ అసిస్టెంట్ లయన్ శేఖర్, వేల్పూరు మాజీ ఎంపీపీ మోతే రామా గౌడ్, మాజీ ఛైర్మన్ పండిత్ పవన్, జిమ్మీ రవి, గిరి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పూజా నరేందర్, పూల సుధాకర్, మీరా శ్రావణ్, సుంకారి రవి, జీజీ రామ్, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.




ఆర్మూర్ పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో..

## అంతిమ యాత్ర వాహనం అందజేత



**అక్షరటుడే, బోధన్:** పట్టణంలోని మైనారిటీల అవసరాల నిమిత్తం అంతిమ యాత్ర వాహనాన్ని ఎఐఎంఎం పట్టణ అధ్యక్షుడు మీర్ ఇలియాస్ అలీ సమకూర్చారు. ఆయన తన సొంత ఖర్చులతో తన తండ్రి జ్ఞాపకార్థం రథం ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎవరు మృతిచెందినా పూర్తి ఉచితంగా రథాన్ని సమకూరుస్తామని ఆయన తెలిపారు.

## క్రీడలతో మానసికోల్లాసం..



**అక్షరటుడే, ఆర్మూర్:** క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక వికాసానికి ఉపయోగపడతాయని అంకాపూర్ సర్పంచ్ దేవేందర్ రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో రెండు రోజులుగా గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. విజేతగా నిలిచిన రెడ్డీస్ క్రికెట్ జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన పాతబస్తీ క్రికెట్ క్లబ్‌కు వీడీసీ అధ్యక్షుడు కుంట గంగారెడ్డి, కార్యదర్శి జంగం మురళి బహుమతి ప్రదానం చేశారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా శ్రావణ్ రెడ్డి మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా దినేష్ ఎంపికయ్యారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా కళ్యాణ్, బెస్ట్ ఆల్ రౌండర్‌గా తరుణ్ బహుమతులు స్వీకరించారు. క్రీడల కన్వీనర్ నాగరాజు, వంశీకృష్ణ, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా అరుణ్, సాయి, అక్షయ్, కళ్యాణ్, దినేష్ రెడ్డి వ్యవహరించారు.




## లేబర్ కోడ్ రద్దు కోసం రాష్ట్ర సదస్సు

**అక్షరటుడే, ఇందూరు :** కార్మికులకు వ్యతిరేకంగా అమలు చేసిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరేందర్, సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని కోట గల్లీలో ఉన్న ఎన్ఆర్ భవన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18 హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వీటికి వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు. చలో హైదరాబాద్ సదస్సును విజయవంతం చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశ్వర్, సహాయ కార్యదర్శి మల్లేష్, కిషన్, సాయరెడ్డి పాల్గొన్నారు.

కోటగిరిలో..



ఆర్మూర్‌లో..



పెద్దకొడప్‌గల్‌లో..



# రోడ్డు భద్రత నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలి..

రోడ్డు భద్రత నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలని పోలీసులు, రవాణా శాఖ అధికారులు సూచించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. – అక్షరటుడే, నెట్‌వర్క్

